క్లుప్తంగా

ఎంపీ కంగనా రనౌత్ క్షమాపణ చెప్పాలి

రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి కె.వి.వి ప్రసాద్



లక్ష్మీపురం: బీజేపీ పార్లమెంటు సభ్యురాలు సినీనటి కంగనా రైతాంగ ఉద్యమం మీద రైతుల మీద తీవ్రమైన పదజాలంతో విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో మంగవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న 140 కోట్ల మంది ప్రజానీకానికి ఈ దేశంలో ఉన్న 15 కోట్ల మంది రైతులు పంటలు పండిస్తేనే వారందరికీ ఆహారం లబ్ధి జరుగుతుంది. అలాంటి రైతులను పట్టుకుని వినియోగించరాని మాటలను ఈ రకంగా దాడి సరైన పద్ధతి కాదన్నారు. తక్షణమే కంగనా దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి తీరాలన్నారు అలాగే కంగనా చేసినటువంటి వ్యాఖ్యలను నిరసిస్తూ కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు.

1న సబ్ జూనియర్ బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బాల బాలికల సబ్ జూనియర్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తామని కార్యదర్శి ఇ.శివ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక బ్రాడీపేటలోని ఎల్ఈఎం స్కూల్లో ఏర్పాటు చేశామన్నారు. ఎంపిక చేసిన జట్లను వచ్చే నెల 13 నుంచి 15 వరకు తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 93969 90666 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కనీస జాగ్రత్తలు పాటించాలి

నగరంపాలెం: చెవి, ముక్కు, గొంతు అనారోగ్య సమస్యల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని ఈఎన్‌టీ వైద్యురాలు ఎం.వి.హరిక అన్నారు. సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బృందా వన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి ఆధునిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యురాలు ఎంవి.హరిక ఈఎన్‌టీ సమస్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, మన్నె సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈఎన్‌టీ వైద్యురాలు హరిక మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు తల భాగంలో ఉండటంతో తీవ్రమైన నొప్పి వస్తుందన్నారు. వాటి బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఇయర్ స్టిక్స్, బడ్స్‌తో చెవుల్లో తిప్పడం వల్ల బ్యాక్టీరియా చేరుతుందని, తద్వారా కర్ణభేరి ఒత్తిడికి గురవుతుందని పేర్కొన్నారు. కాలుష్యం, దుమ్ము, పొగ వాటికి దూరంగా ఉంటే ముక్కు సమస్య రాదని చెప్పారు. కొందరి సందేహాలను నివృత్తి చేశారు.

స్పౌజ్ కేటగిరీకి కొత్త భాష్యం చెబుతున్న విద్యాశాఖ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియలో విద్యాశాఖ రోజుకో కొత్త నిబంధన పేరుతో ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్న సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహణపై మంగళవారం విద్యాశాఖ డైరెక్టర్ నిర్వహించిన వెబ్ ఎక్స్‌లో భాగంగా స్పౌజ్ కేటగిరీపై కొత్త నిబంధనలు విధించడం తగదన్నారు. భార్యా, భర్తల్లో ఒకరు ఉపాధ్యాయులై ఉండి, మరొకరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగి అయితే సంబంధిత ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీ వర్తిస్తుందని తెలిపారు. నిబంధనలు ఈ విధంగా ఉండగా విద్యాశాఖలో పని చేస్తున్న వారికే స్పౌజ్ కేటగిరీని వర్తింప చేస్తామని తాజాగా నిర్ణయం తీసుకోవడం వలన ఎంతో మంది ఉపాధ్యాయులు నష్టపోతారన్నారు. స్పౌజ్ కేటగిరీలో దశాబ్దాల తరబడి అమల్లో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖ తెచ్చిన కొత్త నిబంధన ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించాలని చూస్తే తాము ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. బదిలీల్లో ఇస్తున్న విధంగా సర్దుబాటు ప్రక్రియలోనూ స్పౌజ్ కేటగిరీలో పాయింట్లు కేటాయించాలన్నారు.

భద్రత పెంచాలి



కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. వైద్య ఆరోగ్య మహిళా సిబ్బందికి ప్రభుత్వాలు భద్రత కట్టుదిట్టం చేయాలి. ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో రాత్రి వేళల్లో విధులకు హాజరుకావాలంటే ఇబ్బందిగా ఉంది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యుల రక్షణకు పకడ్బందీగా చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– పి.అన్నపూర్ణ, స్టాఫ్ నర్స్



మహిళలను గౌరవించడం నేర్పాలి

పురుషులతో పోటీపడి ప్రతి రంగంలో మహిళలు వారితో సమానంగా పనిచేస్తున్నారు. మహిళలు పనిచేసే చోట తగిన భద్రత కల్పించాలిన అవశ్యకతను కోల్‌కతా వైద్యురాలి ఘటన సూచిస్తోంది. ఇటువంటి దారుణాలు జరగకుండా ఉండాలంటే కుటుంబంలోని తల్లి, చెల్లిని గౌరవించినట్లే బయట మహిళలను కూడా గౌరవించేలా తమ పిల్లలకు తల్లిదండ్రులు బాల్యం నుంచే నేర్పాలి. స్త్రీ, పురుషులు పరస్పరం గౌరవించుకున్నపుడే మహిళల అత్యాచారాలు, హత్యలు ఆగుతాయి.

– పి.వజిదా, ల్యాబ్ టెక్నీషియన్



అరండల్‌పేటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- మ్యాన్‌హోల్ నుంచి ఉప్పొంగుతున్న మురుగు
- అడుగడుగునా పేరుకు పోతున్న చెత్త
- డెంగీ జ్వరాల బారిన పడుతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న శానిటరీ సిబ్బంది



అరండల్‌పేట 3/1వ అడ్డరోడ్డులో మ్యాన్ హోల్ నిండి పొంగుతున్న మురుగు నీరు



మ్యాన్ హోల్ మురుగు నీరు అరండల్‌పేట 1వ లైన్ వరకు పేరుకు పోయిన వైనం



సైడ్ కాలువల్లో పేరుకు పోయిన మురుగు

లక్ష్మీపురం: నగరంలోని వ్యాపార సంస్థలతో నిత్యం వందలాది మంది సంచరించే ప్రాంతంగా పేరున్న ప్రాంతం అరండల్‌పేట. ఈ ప్రాంతంలోనే నగరపాలక సంస్థ కమిషనర్ నివాసం కూడా. ఈ ప్రాంతంలో రైల్వే స్టేషన్, వ్యాపార సంస్థలు, హోటల్స్, విద్యా సంస్థలతో పాటు ఆసుపత్రులున్నాయి. అయితే ఈ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్య సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అరండల్‌పేట 1,2,3 వలైన్, 1వ అడ్డరోడ్డులో మురుగునీటితో భరించ లేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానిక వ్యాపార సంస్థలు, పాదచారులు, వాహనదారులు ముక్కులు మూసుకోని ప్రయాణిస్తున్నారు. ఈ ప్రాంతంలోని మూడవలైన 1వ అడ్డరోడ్డులోని అండ్ గ్రౌండ్ డ్రెయినేజీ నిండి మ్యాన్ హోల్‌లో నుంచి మురుగు నీరంతా రోడ్డు పైకి వచ్చి చేరుతోంది. దీంతో ఆ ప్రాంతంలో చిరు వ్యాపారులు గత రెండు రోజులుగా దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మ్యాన్ హోల్‌లో నుంచి వస్తున్న మురుగునీరు ఇటు 1వ లైను వరకు అలాగే అటు 4వ లైను వరకు వ్యాపార దుకాణాల ముందుకు పారుతోంది. దీంతో భరించలేని దుర్వాసన వస్తోంది. ఇదిలా ఉంటే ఈ ప్రాంతంలో సైడ్ డ్రెయినేజీలలో పేరుకుపోయి ఉన్న మురుగును తొలగించే పారిశుద్ధ్య కార్మికులు సంబంధిత శానిటరీ సిబ్బంది జాడ కనపడటం లేదు. దీంతో నిత్యం పారిశుద్ధ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు శానిటరీ అధికారులకు సమాచారం తెలియజేసినా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ శుభ్రం చేసే వాహనం అందుబాటులో లేదని, మరోసారి వాహనం మరమ్మతులకు గురైందని చెబుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప కనీస బాధ్యతగా వ్యవహరించడం లేదని చెబుతున్నారు.

ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఇదిలా ఉంటే ఈ ప్రాంతంలో సాయంత్రం 6 గంటల తరువాత నుంచి ఈ మురుగు నీటి వల్ల దోమలతో విషజ్వరాలు, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి తమ గోడును విన్నవించుకొని సమస్యను పరిష్కరించి రోగాల బారి నుంచి రక్షణ కల్పించాల్సిందిగా కోరుతున్నారు.

డ్రెయిన్ శుభ్రం చేయిస్తాం

అరండల్‌పేట 3/1లో మ్యాన్‌హోల్ బ్లాక్ అయి మురుగునీరు వస్తుందన్న సమాచారంతో గత రెండు రోజుల క్రితం శుభ్రం చేయించాం. మళ్లీ మ్యాన్‌హోల్ బ్లాక్ అయింది. వెంటనే దానిని శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్, ఏఈ

రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించాలి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- సిబ్బందిని హెచ్చరించిన నగర కమిషనర్



పట్టణ ప్రణాళిక విభాగ దళంతో మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో రోడ్ల మీద, మార్జిన్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, పట్టణ ప్రణాళిక దళం తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశా రు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నగరంలో రోడ్ల ఆక్రమణలు, ఫ్లెక్సీల తొలగింపుపై పట్టణ ప్రణాళిక దళంతో నగరంలో తీసుకోవల్సిన చర్యలపై మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రోడ్ల మీద ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నాయని, ట్రాఫిక్‌కి కూడా తీవ్ర ఆటంకంగా మారుతున్నాయన్నారు. రోడ్ల విస్తరణ జరిగినప్పటికీ ఆక్రమణల వలన ఉపయోగం లేకుండా పోయిందన్నారు. వివిధ కార్యక్రమాల పేరుతో అనుమతి లేకుండా ఫ్లెక్సీ బ్యానర్లు కడుతున్నారని, అవి గాలికి ఊడిపోయి వాహనాల మీద పడుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆక్రమణల నియంత్రణ, ఫ్లెక్సీ బ్యానర్ల తొలగింపు చేపట్టాల్సిన పట్టణ ప్రణాళిక దళం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వివరించారు. ఇక నుంచి ఏడు రోజుల్లో రోడ్ల మీద ఆక్రమణలు, ఫ్లెక్సీలను నూరు శాతం తొలగించాలని స్పష్టం చేశారు. దళం వారీగా ప్రతిరోజు తొలగించిన వాటి వివరాలతో నివేదిక ఇవ్వాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని విధుల నుంచి తొలగించడం, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

సీపీఐ సదస్సును విజయవంతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: నేడు విజయవాడలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాల్సిందిగా జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలోని మల్లయ్య లింగంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల భూ దందాలకు పాల్పడి ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేసిన వారందరినీ తగిన రీతిలో శిక్షించాలన్నారు. ఎవరైతే భూములు కోల్పోయారో వారికి న్యాయం చేయాలని కోరుతూ అదే విధంగా గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ పోరంబోకు భూముల్లో అలాగే చెరువు పోరంబోకు భూముల్లో ప్రభుత్వ ఎసైన్డ్ భూముల్లో నివాసాలను ఏర్పాటు చేసుకోని ఉన్నటువంటి వారందరికీ తక్షణమే ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు బాధిత ప్రజలు కూడా తరలి రావల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదే విధంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత రోజు రోజుకు అధిక ధరలు రాకెట్ వేగంతో దూసుకు పోతున్నాయన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాని జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కేఎల్పీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్-2024లో భాగంగా అండర్-13 విభాగంలో పి.యశ్వంత్ రాజ్ కుమార్ తృతీయ బహుమతి, అండర్-11లో బి. ప్రజిత్ ప్రథమ బహుమతి, అండర్-9లో ప్రవీణ్ శ్రీనివాస్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నట్లు వివరించారు. అదే విధంగా కృష్ణాష్టమి సందర్భంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో రిత్విక్ ఆరోహ, వెంకట దక్ష, జతిన్ కోటేశ్వర అయాన్, వర్షిణి, నివృత్ రెడ్డి, ఎన్. కారుణ్య, ఎస్‌కే షాజిన్, కీర్తి, కార్తీక్, ఎస్‌కే ఆర్య సుల్తాన్, విరాట్, రమాశ్రీ, జి. జాన్సన్ ఒలీవర్, సీహెచ్ హన్విక్, బి. అద్విక్, ఆర్. ఆరాధ్య, జి. అమృత, వి. ప్రణతి, కె.జాహ్నవి ఆలియా, పి. ప్రశస్త, సీహెచ్ లహరి, ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని తెలిపారు. భగవద్గీత పోటీలో సీనియర్ విభాగంలో కె. హరిణి ప్రథమ బహుమతి, కృష్ణ శతకం లిఖిత పోటీలో సీహెచ్ లహరి ఉత్తమ బహుమతి పొందినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ చదరంగ క్రీడ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇక్కడే చెస్‌లో శిక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె. బసవపున్నయ్య, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

పీఎఫ్ నగదు వెంటనే చెల్లించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నెహ్రూనగర్: ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలో ఉన్నన నగదు వెంటనే చెల్లించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులును ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నం.84 ద్వారా నగరపాలక సంస్థ ఉపాధ్యాయులను విద్యాశాఖకు బదిలీ చేశారని, అప్పటి నుంచి నగరపాలక సంస్థ ఉపాధ్యాయులకు పీఎఫ్ కటింగ్ చేయడం లేదని.. అంతే కాక రెండు సంవత్సరాల నుంచి పీఎఫ్ లోన్లు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై స్పందించి తమకు లోన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షేక్ అబ్దుల్, ఖలీల్, జగదీష్ కుమార్, ఆంథోని బాబు, సాయి విశ్వనాథ్, వేణుగోపాల రావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లోన్లు మంజూరు చేయాలి

ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పీఎఫ్ లోన్లు ఇప్పించాలని యూటీఎఫ్ నగర అధ్యక్షులు చిన్నయ్య కమిషనర్ పులి శ్రీనివాసులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.

29న గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు, కవి సమ్మేళనం

నగరంపాలెం: ఈనెల 29న జిల్లా రచయితల సంఘం, అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేట 15/1 అడ్డరోడ్డు లోని అవగాహన సంస్థ కార్యాలయంలో గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామి రెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గిడుగు రామమూర్తి విశిష్టతను ప్రముఖ రచయిత, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు వివరిస్తారని అన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహిస్తామని, రెండు ఉత్తమ కవితలకు నగదు పురస్కారం అందిస్తామని వారు తెలిపారు.

వైభవంగా స్వామి వారి నగరోత్సవం



నగరోత్సవం ప్రారంభం

నగరంపాలెం: శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా మంగళవారం బృందావన్‌గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఆలయ అర్చకులు కృష్ణ స్వామి అభిషేకం, అర్చనలు జరిగాయి. ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించారు. అనంతరం మాఢవీధులలో ఊరేగింపు నిర్వహించారు. స్వామి వారి ఊంజలసేవ, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

31న వైశ్వకర్మణ మహిళా సదస్సు

నగరంపాలెం: వికాస తరంగిణి సేవా భవనంలో 31న కాకానిరోడ్‌లోని వైశ్వకర్మణ విజ్ఞానవేదిక, దేశీయ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వైశ్వకర్మణ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు వైశ్వకర్మణ మహిళామూర్తులు కాకుమాను రాఘవ కుమారి, వానపాముల సుమిత్రకుమారి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. వైదిక ధర్మచరణం మహిళల పాత్ర అంశంపై వేద బ్రహ్మశ్రీ ఆచార్య టి.మోహన్‌రావు శర్మ ప్రసంగిస్తారని చెప్పారు. పురుషులు కూడా హాజరు కావచ్చునని తెలిపారు.

డాక్టర్ షమ సుల్తానకు 'అప్రిషియేషన్ అవార్డు'



గుంటూరు మెడికల్: మధ్యప్రదేశ్ రాష్ట్రం సోలాపూర్‌లోని ఒబెరాన్ హోటల్‌లో ఈనెల నెల 25న సోలాపూర్ ఆబ్‌స్టెట్రిక్ గైనకాలజికల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ నీతా ఘటే, హానరబుల్ సెక్రటరీ డాక్టర్ అమృత కుంతేకర్‌ల ఆధ్వర్యంలో 'ఎడాల్స్ సెంట్ అండ్ సెక్సువల్ హెల్త్ వర్క్ షాప్' జరిగింది. వివిధ దేశాల నుంచి 150 మంది గైనకాలజిస్టులు, సైకియాట్రిస్టులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌కు స్పీకర్ అండ్ మోడరేటర్‌గా గుంటూరు హోప్ విన్ హస్పిటల్స్ చైర్మన్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన హాజరై 'ఇన్‌ఫెర్టిలిటీ అండ్ సెక్సువల్ డిస్‌ఫంక్షన్' పై ప్రసంగించారు. సదస్సు నిర్వాహకులు డాక్టర్ షమ సుల్తానకు 'అప్రిసియేషన్ అవార్డు' అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ డాక్టర్ షమ సుల్తానకు గుంటూరుకు చెందిన పలువురు గైనకాలజిస్టులు, డాక్టర్ సురేష్ దోషి, డాక్టర్ మదన్ కాంబ్లే, డాక్టర్ రచన జాజు, డాక్టర్ మినాల్, డాక్టర్ కిరణ్ సర్దా, డాక్టర్ పారుల్ సాజి, డాక్టర్ రాహుల్ రెడ్డి, డాక్టర్ ప్రసన్న కథావ్ కర్ తదితరులు స్థానిక గుంటూరువారితోట ఏడోలైన్‌లో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందనలు తెలిపారు.

అమెరికా వెళ్లిన జీజీహెచ్ సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం అమెరికా వెళ్లారు. గుంటూరు వైద్య కళాశాలలో వైద్యవిద్య అభ్యసించి నార్త్ అమెరికాలో స్థిరపడిన పలువురు వైద్యులు జింకానా పేరుతో గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి భారీగా విరాళాలు అందిస్తూ ఎంతో కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో రూ.100 కోట్లతో నిర్మాణం చేపట్టిన మాతా శిశు సంరక్షణ విభాగం (ఎంసీహెచ్‌వార్డు) పూర్తి చేసేందుకు కావల్సిన నిధుల సేకరణ కోసం జింకానా వారు అమెరికాలో ప్రత్యేకంగా సమావేశం కా నున్నారు. ఈ సమావేశానికి జీజీహెచ్ సూప రింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను రావాలని ఆహ్వానించటంతో ఆయన అమెరికా వెళ్లారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై. సత్యకుమార్ కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

జగన్నాథుడి సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు



స్వామివారి రథం లాగుతున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక కొత్తపేట (పశువుల ఆసుపత్రి ఎదురు) జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో వైఖానస ఆగమం ప్రకారం మంగళవారం శ్రీకృష్ణాష్టమి అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయి. శ్రీవేణు గోపాలస్వామి వారికి పంచామృతలతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూలంకరణ జరగ్గా, దేవస్థానం ఆవరణలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో గ్రామోత్సవం జరగ్గా, భక్తులు బారులు తీరి స్వామి, అమ్మవార్లకు దర్శించుకున్నారు. అనంతరం ఉట్టి కార్యక్రమం జరగ్గా, ఉట్టి కొట్టేందుకు యువకులు, భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో దేవస్థానం ఏసీ దీవి శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు మైలవరపు సుజన, సూరిబోయిన వెంకట్రావు, అర్చకులు అయోధ్యఅయ్యప్ప, భక్తులు పాల్గొన్నారు.

నేడు భగవాన్ ధన్వంతరీ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్లో భగవాన్ దన్వంతరీ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో కేంద్ర మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌లు, ఎస్పీలు, నగర ప్రముఖులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భగవద్గీతను స్ఫూర్తిగా తీసుకోండి



విద్యార్థినులతో శ్రీనివాసరావు, ఏడుకొండలు, కోటిరత్నం, ఉషాకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: భగవద్గీతను స్ఫూర్తిగా తీసుకుని సక్రమ జీవితాన్ని గడపాలని శ్రీశారదానికేతనం విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ప్రభు త్వ బాలికోన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన వక్తృత్వం, క్విజ్, భగవద్గీత శ్లోక పఠనం, కోలా టం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు మంగళవారం బహుమతులు అందజేశా రు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మా ట్లాడుతూ శ్రీకృష్ణుని జననం సర్వ మానవాళికి జీవన విధానానికి స్ఫూర్తి దాయకమని అన్నారు. భగవంతుడు మనకు అందించిన గొప్ప వరం గీతాసారం మనిషి జీవనశైలి, జీవన విధానాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా గీతా సారం అందరికీ మార్గదర్శకమని అన్నారు. ధార్మికవేత్త ఆకుల ఏడుకొండలు మాట్లాడుతూ భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా మంచి, చెడుల విచక్షణ గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. శారదానికేతన్ ఓరియెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటిరత్నం, హైస్కూల్ హెచ్‌ఎం ఎస్. ఉషాకుమారి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.